హైదరాబాద్
24-7-2023
సంపుటి:08
సంచిక: 327
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole



## వారం రోజులు వర్షాలే

**ఒడిశా తీరంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం**

**నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం**

అమరావతి/విశాఖపట్నం: రాష్ట్రంపై ఉపరితల ఆవర్తనం, రుతు పవన ద్రోణులు ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మరో వారం రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నట్టు వాతావరణ



2లో

## వీఆర్ఏ వ్యవస్థ రద్దు

- మరో కీలక నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్
- వారంతా రెవెన్యూ శాఖలోనే క్రమబద్ధీకరణ
- ఆ తర్వాత ఇతర శాఖల్లో సర్దుబాటు
- విద్యార్హతల ఆధారంగా 20,555 మందికి పోస్టింగ్‌లు
- ఉన్నత చదువులు చదివినవారికి ప్రమోషన్లకు అనుగుణమైన పోస్టులు
- సోమవారమే ఉత్తర్వులు ఇవ్వాలని సీఎం ఆదేశం

హైదరాబాద్: నీరటి, మస్కూరు, లష్కర్ వంటి కాలం చెల్లిన పేర్లతో పిలవబడుతూ భూస్వామ్య వ్యవస్థకు చిహ్నాలుగా మిగిలిన గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) వ్యవస్థను శాశ్వతంగా రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా వీఆర్ఏలుగా పనిచేస్తున్న సిబ్బందిని రెవెన్యూ శాఖలో సూపర్ న్యూమరరీ పోస్టుల్లో క్రమబద్ధీకరిస్తామన్నారు. తర్వాత మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సుల మేరకు

# బీసీలకు 34 టికెట్లు

## ప్రతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయిద్దాం



- టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ
- సమావేశంలో రేవంత్‌రెడ్డి ప్రతిపాదన
- బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించాలని నిర్ణయం
- 30న కొల్లాపూర్‌లో ప్రియాంక సభ
- ఆగస్టు 15న ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గర్జన
- టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ
- సమావేశంలో రేవంత్‌రెడ్డి ప్రతిపాదన

హైదరాబాద్: వచ్చే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ప్రతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో రెండు అసెంబ్లీ సెగ్మెంట్లలో బీసీలకు టికెట్లు ఇవ్వాలని ఆ పార్టీ యోచిస్తోంది. మొత్తంగా రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల పరిధిలో 34 మంది బీసీ అభ్యర్థులను బరిలోకి దింపాలని భావిస్తోంది. ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ ప్రతిపాదన చేశారు. దీనిపై చర్చించిన పీఏసీ సమావేశం ఈ అంశాన్ని బీసీ డిక్లరేషన్‌లోనూ ప్రకటించాలని నిర్ణయించింది. దీంతోపాటు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రానున్న వంద రోజులు ప్రచార కార్యక్రమాలను ఉధృతం చేయాలని, పార్టీ అధికారంలోకి వస్తే వివిధ వర్గాలకు ఏం చేయనున్నామనే విషయాన్ని ఆ కార్యక్రమాల్లో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న నిర్ణయించింది. అధికారంలోకి వస్తే రైతులకు, యువతకు ఏం చేస్తామన్నది చెబుతూ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే డిక్లరేషన్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళల సంక్షేమం, అభివృద్ధికి కూడా ఏం చేయాలన్నదానిపైనా డిక్లరేషన్లు పూర్తి చేసి ప్రచార

మిగతా 2లో



## మరో దారుణం

- మణిపూర్‌లో 18 ఏళ్ల యువతిని
- అపహరించి సామూహిక అత్యాచారం
- ప్రత్యర్థి వర్గం మహిళలే పురుషులకు
- అప్పగించిన వైనం.. మే 15న ఘటన
- గత శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదు
- చురాచాంద్‌పూర్‌లో కాల్పులు
- నేడు పార్లమెంటులో
- ‘మణిపూర్’పై విపక్షాల పట్టు
- చేతులెత్తి కోరుతున్నా.. చర్చకు రండి
- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్

ఇంఫాల్/న్యూఢిల్లీ :మణిపూర్‌లో జరిగిన ఘాతుకాలు అంతులేని కథలా వెలుగులోకి వస్తూనే ఉన్నాయి..! మహిళలను నగ్నంగా ఊరేగించి ఓచోట.. కార్ల సర్వీస్ షోరూంలోకి దూసుకెళ్లి యువతులను హింసించి మరోచోట సామూహిక అత్యాచారాలకు పాల్పడిన తరహాలోనే మరో దారుణం బయటపడింది. ఈసారి బాధితురాలు 18 ఏళ్ల గిరిజన యువతి. ఈమెను

మిగతా 2లో

## నేడు పార్లమెంటు ఎదుట విపక్షాల నిరసన

న్యూఢిల్లీ, పార్లమెంటు వేదికగా మణిపూర్ అంశంలో మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు విపక్షాలు ప్రణాళికలు సిద్ధం చేశాయి. సోమవారం నుంచి పునఃప్రారంభంకానున్న సమావేశాలను ఇందుకు ఉప గాంధీ విగ్రహం ఎదుట నిరసన చేపట్టనున్నారు. దీనికిముందు రాజ్యసభలో ప్రతిపక్షనేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చాంబర్‌లో వీరంతా

మిగతా 2లో



మిగతా 2లో


## మెడికల్ కాలేజీల్లో తెలంగాణ 5

- కాలేజీల సంఖ్యలో తమిళనాడు, సీట్లలో కర్ణాటక టాప్
- 40% ఎంబీబీఎస్ సీట్లు, 38% కాలేజీలు దక్షిణాదిలోనే
- ‘టాప్ ఫైవ్’లో 3 దక్షిణాది రాష్ట్రాలు.. కేంద్రం వెల్లడి

హైదరాబాద్: వైద్య కళాశాలలు, ఎంబీబీఎస్ సీట్ల విషయంలో దేశంలో తెలంగాణ ఐదో స్థానంలో ఉన్నట్లు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల వివరాలు, సీట్ల సంఖ్య తెలపాలని పలువురు ఎంపీలు కోరారు. ఆ వివరాలను కేంద్ర

## దారం తెగె.. పిట్ట పాయె?

- ట్విటర్ లోగోగా ఉన్న పిట్టను తీసేసి
- దాని స్థానంలో ‘ఎక్స్’ పెడతా: మస్క్
- ట్విటర్ రంగునూ నల్లగా మార్చే యోచన
- మస్క్ పోల్ పెడితే 76.3% సానుకూలం
- ట్విటర్‌కు పోటీగా మెటా అభివృద్ధి చేసిన
- ‘థ్రెడ్స్’ యాప్‌కు భారీగా తగ్గిన డౌన్‌లోడ్స్
- ట్విటర్ లోగోగా ఉన్న పిట్టను తీసేసి
- దాని స్థానంలో ‘ఎక్స్’ పెడతా: మస్క్



న్యూఢిల్లీ, జూలై 23: ట్విటర్‌ను కొన్నప్పటి నుంచీ దాంతో రకరకాల ప్రయోగాలు చేస్తున్న ఈలన్ మస్క్. తాజాగా దాని లోగో అయిన పిట్ట ను తీసేసి ‘ఎక్స్’ అనే అక్షరాన్ని లోగోగా పెడతానని ప్రకటించారు. త్వరలోనే ట్విటర్ బ్రాండ్ కు, అన్ని పక్షులకూ వీడ్కోలు పలుకుతామని.. మంచి ‘ఎక్స్’ లోగో ను రూపొందించగలిగితే దాన్ని ఆదివారం రాత్రికి పోస్ట్‌చేసి సోమవారం నుంచి ప్రపంచమంతటా లైవ్‌లోకి తెస్తామని వెల్లడించారు. ఎక్స్ హోల్డింగ్స్ కార్పొరేషన్ పేరిట గత మార్చిలో అమెరికాలోని నెవాడా రాష్ట్రం లో మస్క్ ఓ కొత్త కంపెనీని స్థాపించారు. ‘ఎక్స్’ అనే దాన్ని కొన్నాళ్లుగా ఆయన ‘ఎవ్రిథింగ్ యాప్’గా వ్యవహరిస్తున్నారు. ఇక ట్విటర్ లోగో మార్పునకు

మిగతా 2లో



## ఎంఎస్ఎంఈల నమోదుకు సర్వే

- మన రాష్ట్రంలో ఉద్యం పోర్టల్ కింద నమోదైన ఎంఎస్ఎంఈలు 5,26,993
- పోర్టల్‌లో నమోదుతో ఆయా సంస్థలకు ఎంతో మేలు
- పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని కలెక్టర్లకు సీఎస్ ఆదేశం

అమరావతి: రాష్ట్రంలో లక్షలాదిగా ఉన్న సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈలను)గుర్తించి వాటిని నమోదు చేసే బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ గుర్తింపు లేకపోవడంతో నమోదుకాని ఎంఎస్ఎంఈలకు ఎటువంటి ప్రభుత్వసాయం అందటం లేదు. కేంద్ర ప్రభుత్వరంగ ఉద్యం పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలతో

మిగతా 2లో

# నేడు పార్లమెంటు ఎదుట విపక్షాల నిరసన

(మొదటి పేజీ తరువాయి)

సమావేశమై సభలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చిస్తారు. మణిపూర్‌లో ఏం జరుగుతున్నదో ప్రధాని మోదీ ప్రకటన చేసేలా ఒత్తిడి పెంచేందుకే నిరసనకు దిగుతున్నట్లు కాంగ్రెస్ సీనియర్‌నేత ఒకరు తెలిపారు. కాగా ఈ నెల 20న పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. మణిపూర్ ఉదంతంపై ఉభయ సభలు అట్టుడికాయి. పూర్తిస్థాయి చర్చ జరగాల్సిందేనని, సభలో మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్, ఆర్జేడీ, ఎంఐఎం, వామపక్షాలు, బీఆర్ఎస్ తదితర ప్రతిపక్షాలు గళమెత్తాయి. ప్రధాని సమక్షంలోనే చర్చ జరగాలని డిమాండ్ చేశాయి. మణిపూర్‌పై చర్చించాలని వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టాయి. సభ్యులు ఇచ్చిన నోటీసులపై స్వల్పకాలిక చర్చకు అటు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ అంగీకరించారు. అయితే రాజ్యసభ రూల్ 267 కింద సభా కార్యకలాపాలన్నీ నిలిపివేసి మణిపూర్‌పై చర్చ జరపాలని ఖర్గే పట్టుబట్టారు. దీనికి అనుమంతిచకపోవడంతో గురు, శుక్రవారాల్లో వాయిదాల పర్వం సాగిం ది. కాగా, 1990 తర్వాత రూల్ 267 కింద రాజ్యసభలో 11సార్లు చర్చించారు. చివరిగా..2016లో నోట్ల రద్దుపై దీర్ఘకాలిక చర్చ జరిగింది. విపక్షాల పట్టుదల నేపథ్యంలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ స్పందించారు. 'చేతులెత్తి కోరుతున్నా.. మణిపూర్‌పై జరిగే స్వల్పకాలిక చర్చలో పాల్గొనండి. అక్కడ మహిళలపై జరుగుతున్న దారుణాలను రాజకీయం చేయకండి' అని విజ్ఞప్తి చేశారు.యోగించుకోనున్నాయి. 'ఇండియా' కూటమి నేతలు, ఎంపీలు పార్లమెంటు ఆవరణలోని

# మెడికల్ కాలేజీల్లో తెలంగాణఏ 5

(మొదటి పేజీ తరువాయి)

వైద్య శాఖ శుక్రవారం పార్లమెంటుకు తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో 28, ప్రైవేటులో 28 మెడికల్ కాలేజీలు ఉన్నాయి. సర్కారీ కళాశాలల్లో మొత్తం 3,890, ప్రైవేటులో 4,650 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలతో పాటుఎయిమ్స్, జిప్‌మర్‌లతో కలసి మొత్తం 703 కళాశాలలు ఉన్నాయి. ఇందులో 379 ప్రభుత్వ వైద్య కళాశాలలు. మిగతా 324 ప్రైవేటువి. వీటిలో మొత్తం 1,07,948 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని 379 కాలేజీల్లో 56,283 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. అంటే మొత్తం కాలేజీల్లో ఇవి 54 శాతం, మొత్తం సీట్లలో 52 శాతమని వివరించింది. ఇక ప్రైవేటులో 46 శాతం కాలేజీలు, 48 శాతం సీట్లు ఉన్నట్లు వెల్లడించింది. దేశంలో అత్యధిక ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉన్న రాష్ట్రంగా తమిళనాడు నిలిచింది. ఆ రాష్ట్రంలో 38 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్ (35), మహారాష్ట్ర (31), తెలంగాణ (28), పశ్చిమ బెంగాల్ (27), రాజస్థాన్ (26), గుజరాత్ (23) నిలిచాయి. తమిళనాడులో 36 ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు కలిపి చూసినా కూడా దేశంలో అత్యధిక కాలేజీలు (74) ఉన్న రాష్ట్రం తమిళనాడే. ఆ తర్వాత కర్ణాటకలో 70 కళాశాలలు ఉన్నాయి. అక్కడ ఒక్క ప్రైవేటులోనే 46 ఉండటం విశేషం. మూడో స్థానంలో మహారాష్ట్ర (67), నాలుగో స్థానంలో యూపీ, ఐదో స్థానంలో తెలంగాణ ఉన్నాయి.

# వీఆర్ఏ వ్యవస్థ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

వీఆర్ఏలను అర్హతల ఆధారంగా పురపాలక, మిషన్ భగీరథ, నీటిపారుదల తదితర శాఖల్లో సర్దుబాటు చేస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సోమవారమే జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. వీఆర్ఏల క్రమబద్ధీకరణ అంశంపై ఆదివారం సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం కేసీఆర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు సీఎం కార్యాలయం ప్రకటించింది. సమీక్ష సందర్భంగా.. సామాజిక పరిణామ క్రమంలో మార్పులకు అనుగుణంగా, ప్రజల అవసరాలను అనుసరించి పాలకులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. కాలానుగుణంగా కనుమరుగవుతున్న వృత్తుల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని.. ఈ క్రమంలోనే వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేస్తున్నామని స్పష్టం చేశారు. "వ్యవసాయం అభివృద్ధి చెంది సాగునీటి విధానం అమల్లోకి వచ్చినకాలంలో గ్రామాల్లో నీటి వ్యవస్థను సక్రమంగా నిర్వహించడం, గ్రామ రెవెన్యూ, ఇతర విభాగాల అవసరాల కోసం ఏర్పాటైన గ్రామ సహాయకుల వ్యవస్థ తర్వాత వీఆర్ఏలుగా రూపాంతరం చెందింది. తరతరాలుగా సామాజిక సేవ చేస్తున్న వీఆర్ఏల త్యాగపూరిత సేవ గొప్పది. నేటి మారిన పరిస్థితుల్లో వీఆర్ఏ వృత్తికి ప్రాధాన్యత తగ్గింది. ఈ నేపథ్యంలో వారిని రెవెన్యూ శాఖలో క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకుంటున్నాం.." అని సీఎం కేసీఆర్ తెలిపారు. అట్టడుగు స్థాయి నుంచి త్యాగాలు, శ్రమతో సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తున్న వారిపట్ల తమ ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి, నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పలుమార్లు ఎవరూ అడగకుండానే ఉద్యోగ వర్గాలకు జీతాలు పెంచి వారి సంక్షేమానికి పాటుపడ్డామని వివరించారు.

# దారం తెగె.. పిట్ట పాయె?

(మొదటి పేజీ తరువాయి)



సంబంధించిన ట్వీట్ చేసిన గంట తర్వాత.. ట్విటర్ ప్లాట్‌ఫామ్ రంగును నీలం నుంచి బ్లాక్‌కు (నలుపు)మార్చే ఆలోచనలో ఉన్నట్టు మస్క్ మరో ట్వీట్ చేశారు. దీనికి సంబంధించి ఆయన నిర్వహించిన పోల్‌కు గంట వ్యవధిలో 2.24 లక్షల మంది స్పందించారు. వారిలో 76.3శాతం మంది రంగు మార్పుపై సానుకూలంగా స్పం దించారు. ఇక ట్విటర్‌కు పోటీగా ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా అభివృద్ధి చేసిన థ్రెడ్స్ (దీని లోగో దారం) జోరు తగ్గింది. ఆ యాప్‌ను తెచ్చిన కొద్దిరోజుల్లోనే కోటిమందికిపైగా డౌన్‌లోడ్ చేసుకోవడంతో ట్విటర్‌కు అది గట్టి పోటీ ఇస్తుందనుకున్నారు. 'ట్విటర్ కిల్లర్' అని దానికి పేరు కూడా పెట్టేశారు. కానీ.. ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నవారి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాతో దాన్ని అనుసంధానం చేయడంతో.. థ్రెడ్స్‌ను డిలీట్ చేస్తే ఇన్‌స్టా ఖాతా కూడా డిలీట్ అయిపోతోంది. ట్విటర్ వినియోగదారులు అనామకంగా తమ ఖాతాను వాడుకునే వీలుంది. ఈ నేపథ్యంలో.. థ్రెడ్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసేవారి సంఖ్య భారీ గా తగ్గిపోయింది.

# మరో దారుణం

(మొదటి పేజీ తరువాయి)

కొందరు మహిళలే సాయుధులకు అప్పగించి, వారిని అఘాయిత్యానికి ప్రోత్సహించడం గమనార్హం. పోలీస్ ఎఫ్ఐఆర్ ప్రకారం.. మే 15న సాయంత్రం తూర్పు ఇంఫాల్ జిల్లాలో ఓ యువతిని ఊదా రంగు కారులో వచ్చిన నలుగురు పురుషులు అపహరించారు. వాంగ్‌ఖీ అయాంగ్‌పాలికి తీసుకెళ్లి దాడి చేశారు. మీరా పైబీ గ్రూప్ మహిళలు, మరికొందరు మగవారికి ఫోన్లు చేసి పిలిచారు. అందరూ కలిసి యువతిని తీవ్రంగా హింసించారు. ఇంతలో నల్ల దుస్తులు ధరించిన నలుగురు సాయుధులు వచ్చారు. మీరా పైబీ మహిళలు.. బాధిత యువతిని అప్పగించగా వారు మరో కారులో ఎక్కించుకుని వెళ్లారు. ప్రశ్నలడుగుతూ, చెంప దెబ్బలకు తోడు తుపాకీ మడమతో కొడుతూ ఓ కొండపైకి తీసుకెళ్లారు. చంపేయాలని అనుకున్నా పోలీసు కేసుకు భయపడి వెనక్కుతగ్గారు. నలుగురిలో పెద్దవాడైన వ్యక్తి కాళ్లపై పడిన యువతి తనను చంపొద్దని, ఇక ఇంఫాల్‌కు రానని, అమ్మానాన్న దగ్గరకు వెళ్తానని వేడుకుంది. కానీ, ఆమెను హతమార్చే ఉద్దేశంలోనే ఉండడంతో అక్కడినుంచి సుదీర్ఘ ప్రయాణంతో మరో కొండ ప్రాంతానికి తీసుకెళ్లారు. కారులోంచి బయటకు తీసుకొచ్చి మరింత తీవ్రంగా హింసించారు. ముఖంపై తుపాకీ అడుగు భాగంతో కొట్టడంతో యువతి మూర్ఛపోయింది. నీళ్లు చల్లి ఆమె స్పృహలోకి వచ్చాక ముగ్గురు అత్యాచారం చేశారు. చెవులు, ముఖం, తలలోంచి రక్తం కారుతున్న ఆమెను చంపేయాలని, లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తుందని వారంతా చర్చించుకున్నారు. వదిలేశాక పోలీసుల వద్దకు వెళ్తే వెదికి పట్టుకుని మరీ చంపేస్తామని యువతిని హెచ్చరించారు. ఈలోగా ఒకడు కారును తిప్పే ప్రయత్నంలో యువతిని ఢీకొట్టాడు. దీంతో ఆమె కొండపై నుంచి వాగులోకి పడిపోయింది. ఎలాగోలా ప్రాణాలతో బయటపడిన యువతి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో రోడ్డుపైకి చేరుకుని ఓ ఆటోను ఆపింది. రక్తసిక్తమైన దుస్తులతో ఉన్న ఆమెను ఆటో డ్రైవర్.. ఎవరికీ కనిపించకుండా కూరగాయ మూటల మధ్యన దాచి విష్ణుపూర్ ఠాణాకు తీసుకెళ్లాడు. కాగా, పోలీసులు మెయిటీ వర్గం వారు కావడంతో ఆటో డ్రైవర్‌నే న్యూలంబ్లానే ప్రాంతంలో ఉన్న ఇంటివద్ద దింపాలని కోరింది. అలా.. మే 16 తెల్లవారుజామున 4.30 గంటలకు ఇంఫాల్ నుంచి సేనాపతి జిల్లాలోని సపోర్మీనా గ్రామానికి వెళ్లింది. కాంగ్పోక్పీ జిల్లా ఆస్పత్రిలో చికిత్స కోసం వెళ్లగా సీరియస్‌గా ఉండడంతో నాగాలాండ్ రాజధాని కోహిమా ఆస్పత్రికి రిఫర్ చేశారు. గత వారం మహిళలను నగ్నంగా ఊరేగించిన ఉదంతం వెలుగులోకి వచ్చాక.. యువతి ధైర్యం చేసింది. శుక్రవారం కాంగ్పోక్పి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాడి, హత్యాయత్నం, అపహరణ, సామూహిక అత్యాచారం, అట్రాసిటీ చట్టం కింద గుర్తుతెలియని వ్యక్తులు, మీరా పైబీ గ్రూప్‌పై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం కేసును తూర్పు ఇంఫాల్ స్టేషన్‌కు బదిలీ చేశారు. మణిపూర్‌లో హింస ఆగడం లేదు. ఇటీవల నిరసనలకు వేదికగా నిలుస్తున్న చురాచాంద్‌పూర్ జిల్లాలో శనివారం రాత్రి ఘర్షణలు జరిగాయి. టోర్బంగ్ గ్రామంలోని పాఠశాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మరోవైపు హింసకు ఫేక్ న్యూస్, ఫొటోలు మరింత ఆజ్యం పోస్తున్నాయని పోలీసులు, భద్రతా బలగాలు చెబుతున్నాయి. నాగాలాండ్,దంతాల తాలూకు ఫొటోలను చూపుతూ అల్లరి మూకలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని వివరిస్తున్నారు.

# నేడు సీఆర్‌డీఏలో పేదల ఇళ్లకు శ్రీకారం

అమరావతి: అమరావతిలో పేదలకు ఇళ్లు ఇస్తే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందన్న పెత్తందారుల వితండ వాదాలకు చెక్ పెడుతూ నిరుపేద అక్కచెల్లెమ్మల సొంతింటి కల సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా.. నవరత్నాలు ఎదలందరికీ ఇళ్లు పథకం కింద సీఆర్‌డీఏలో 50వేలకు పైగా ఇళ్ల నిర్మాణానికి సోమవారం ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. గూడు లేని పేద అక్కచెల్లెమ్మలకు స్థిరనివాసం సమకూర్చి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్న కృతనిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఎల్లో ముఠా కుట్రపూరితంగా సృష్టించిన అడ్డంకులను అధిగమించి సీఆర్డీఏ పరిధిలో 1,402.58 ఎకరాలు, 25 లేఅవుట్‌లలో 50,793 మంది పేద అక్కచెల్లెమ్మలకు ఈ ఏడాది మే 26న ఉచితంగా ఇళ్ల పట్టాలు అందించిన విషయం తెలిసిందే. ఒక్కో ప్లాట్ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల విలువ చేసే రూ.1,371.41 కోట్ల ఖరీదైన భూమిని పేదలకు ఉచితంగా పంపిణీ చేయడమే కాక.. ఆయా లేఅవుట్‌లలో రూ.384.42 కోట్లతో మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించనుంది.అలాగే.. విద్య, ఆరోగ్య సేవలు అందించేందుకు రూ.73.74 కోట్లతో 11 అంగన్‌వాడీ కేంద్రాలు, 11 పాఠశాలలు, 11 డిజిటల్ లైబ్రరీలు, 12 ఆస్పత్రుల నిర్మాణం కూడా చేపట్టనుంది. లేఅవుట్ల పరిధిలో పచ్చదనాన్ని పెంపొందించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటుచేసేందుకు రెండు దశల్లో రూ.168 లక్షలతో 28,000 మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోనున్నారు.



ఇలా ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల ఏర్పాటుతో ఒక్కో పేద అక్కచెల్లెమ్మ చేతుల్లో దాదాపు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు పైగా విలువైన స్థిరాస్తిని పెట్టబోతోంది. ఈ లెక్కన ఏపీ గృహ నిర్మాణ సంస్థ ద్వారా సీఆర్‌డీఏలోని ఈడబ్ల్యూఎస్ లేఅవుట్లలో రూ.1,829.57 కోట్ల వ్యయంతో పేదలకు పక్కా గృహాలను సమకూరుస్తోంది.

**మహిళా సాధికారతే లక్ష్యంగా..**

నిజానికి.. సీఎం జగన్ ప్రభుత్వం తొలి నుంచి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ వస్తోంది. మహిళలు తమంతట తాము నిలదొక్కుకునేలా వివిధ పథకాలు, కార్యక్రమాలను అమలుచేస్తోంది. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం కింద మహిళల పేరిట స్థలాలు, ఇళ్లు అందిస్తోంది. ఇందులో భాగంగా.. దేశంలో ఎక్కడాలేని విధంగా 71,811 ఎకరాల్లో 30.65 లక్షల మంది అక్కచెల్లెమ్మల పేరిట ఉచితంగా రూ.76,625 కోట్ల మార్కెట్ విలువైన భూములను పంపిణీ చేశారు.

ఇలా వైఎస్సార్, జగనన్న కాలనీల రూపంలో 17వేలకు పైగా ఊళ్లనే కొత్తగా నిర్మిస్తున్నారు. పంపిణీ చేసిన స్థలాల్లో ఇప్పటికే రూ.57,375 కోట్ల వ్యయంతో 21.25 లక్షల ఇళ్ల నిర్మాణం కొనసాగుతోంది. కాలనీల్లో రూ.32,909 కోట్ల వ్యయంతో నీటి సరఫరా, విద్యుత్, ఇంటర్‌నెట్, డ్రైనేజీ, సీవరేజీ, రోడ్లు వంటి మౌలిక వసతులను కల్పిస్తున్నారు.

**రూ.లక్షల కోట్ల సంపద సృష్టి**

మరోవైపు.. ప్రతి పేద అక్కచెల్లెమ్మకు ఇంటి స్థలం, ఇల్లు సమకూర్చడం ద్వారా రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల సంపదను రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తోంది. ఇంటి స్థలం ఉచితంగా ఇవ్వడమే కాక.. ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షల చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. పావలా వడ్డీకి రూ.35 వేలు చొప్పున బ్యాంకు రుణం సమకూరుస్తోంది. అంతేకాక.. ఉచితంగా ఇసుక ఇవ్వడం ద్వారా రూ.15 వేలు, సిమెంట్, స్టీల్, మెటల్ ఫ్రేమ్స్ ఇంకా ఇతర నిర్మాణ సామాగ్రిని సబ్సిడీపై అందించడంతో మరో రూ.40 వేల మేర లబ్ధి చేకూరుస్తోంది.




# బీసీలకు 34 టికెట్లు

(మొదటి పేజీ తరువాయి)

కార్యాచరణలో దిగాలన్న నిర్ణయం జరిగింది. ఈ డిక్లరేషన్ల రూపకల్పనకుగాను నిపుణులతో సబ్ కమిటీ వేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ డిక్లరేషన్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 15న కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గర్జన సభ నిర్వహించనున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అధ్యక్షతన జరగనున్న సభలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు కాంగ్రెస్ ఏం చేయనున్నది వివరిస్తూ డిక్లరేషన్ ప్రకటించనున్నారు. కాగా, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీజేపీ, బీఆర్ఎసలకు చెందిన పలువురు నాయకుల చేరికకు సంబంధించి ఈ నెల 30న కొల్లాపూర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ హాజరు కానున్నట్లు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే పీఏసీ సమావేశంలో తెలిపారు. ఆ సభలోనే మహిళా డిక్లరేషన్‌ను ప్రకటించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఇక నేతల ఐక్యతను చాటేందుకు బస్సుయాత్ర నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ ఇటీవల నిర్ణయించిన నేపథ్యంలో పీఏసీ సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. దీనిపై సబ్‌కమిటీని నియమించారు. త్వరలో రాష్ట్రంలో బీసీ గర్జన సభను ఏర్పాటు చేసి, దానికి రాహుల్‌తోపాటు కర్ణాటక సీఎం సిద్దరామయ్యను కూడా ఆహ్వానించాలని వీహెచ్ ప్రతిపాదించారు.

**ఐదు స్థానాలో పార్టీని మెరుగుపరచుకోవాలి..**

పీఏసీ సమావేశంలోనే పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు రాష్ట్రంలో ఎంపీ స్థానాల వారీగా పార్టీ బలాబలాలపై నివేదికను చదివి వినిపించారు. ఐదు ఎంపీ స్థానాల పరిధిలో పార్టీ కాస్త వెనకబడి ఉందని తెలిపారు. మిగతా చోట్ల పార్టీ బాగా మెరుగుపడిందని, అధికారంలోకి వస్తామని అన్నారు. ఆ ఐదు ఆ స్థానాల్లో కూడా పార్టీని మెరుగుపరచుకోవాలని సూచించారు. నేతల మధ్య అంతరాలున్నాయని, సంప్రదింపుల ద్వారా వాటిని తొలగించుకోవాలని అన్నారు.

# ఎంఎస్ఎంఈల నమోదుకు సర్వే

(మొదటి పేజీ తరువాయి)

పాటు బ్యాంకు రుణాలు, ప్రభుత్వరంగ సంస్థలకు ఉత్పత్తులు విక్రయించే అవకాశాలు ఎంఎస్ఎంఈలకు ఏర్పడతాయి. 2015-16 శాంపిల్ సర్వే ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 33,87,000 నమోదుకాని ఎంఎస్ఎంఈలు ఉన్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది. మన రాష్ట్రం నుంచి ఉద్యం పోర్టల్‌లో నమోదైన ఎంఎస్ఎంఈల సంఖ్య 5,26,993 మాత్రమే. ఎంఎస్ఎంఈల సంఖ్య పరంగా మన రాష్ట్రం 13వ స్థానంలో ఉంది. 31.22 లక్షల ఎంఎస్ఎంఈలతో మహారాష్ట్ర మొదటిస్థానంలో, 17.82 లక్షలతో తమిళనాడు రెండోస్థానంలో ఉన్నాయి. రాష్ట్రయిలో ఇలా నమోదుకాని ఎంఎస్ఎంఈలను గుర్తించి వాటిని నమోదు చేయించడం ద్వారా ప్రభుత్వ పథకాలు అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ సర్వే పేరిట వాస్తవంగా ఉన్న ఎంఎస్ఎంఈల సంఖ్యను వెలికితీయనుంది. గ్రామ, వార్డు వలంటీర్ల సహాయంతో ఈ వివరాలను సేకరించడానికి టీసీఎస్ సంస్థతో ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ ద్వారా ఎంఎస్ఎంఈ వ్యాపార పరిమాణ, ఏ రంగానికి సంబంధించిన ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తుంది, ఎంతమందికి ఉపాధి కల్పిస్తోంది, ఎంఎస్ఎంఈ ఇన్వెస్ట్‌మెంట్స్, ఎంప్లాయిమెంట్ వంటి అన్ని వివరాలను సేకరించనున్నారు. ఈ సర్వే బాధ్యతను ప్రభుత్వం పరిశ్రమల శాఖతోపాటు జిల్లా కలెక్టర్లకు అప్పగించింది. ఈ సర్వేకి సంబంధించి గ్రామ, వార్డు వలంటీర్లకు శిక్షణ ఇచ్చి తొలుత పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.ఎస్.జవహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఈ సర్వే అనంతరం వచ్చిన డేటా ఆధారంగా రాష్ట్రంలో ఎంఎస్ఎంఈల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై నిర్దిష్ట కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేయనున్నారు.

# వారం రోజులు వర్షాలే

(మొదటి పేజీ తరువాయి)

శాఖ తెలిపింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో విస్తారంగా వర్షాలు పడతాయని, పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. దక్షిణ ఒడిశాకు ఆనుకుని ఒక ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండటం, బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడటంతోపాటు నైరుతి రుతుపవనాలు బలంగా ఉండటం వల్ల వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం వచ్చే 24 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. వీటి ప్రభావంతో ఈ నెల 29వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ఆదివారం విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా విజయనగరం జిల్లా కొత్తవలసలో 11.3 సెం.మీ, విశాఖపట్నం మధురవాడలో 10.6 సెం.మీ. భారీ వర్షపాతం నమోదైంది.

## ఫ్లైఓవర్‌పై స్పోర్ట్స్ బైక్ ప్రమాదం.. యువకుడు మృతి




హైదరాబాద్,సమ సమాజం: నగరంలో జరిగిన రోడ్డు ?ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గచ్చిబౌలిలో చోటుచేసుకుంది. మితి మీరిన వేగంతో బైక్‌పై వెళ్తూ అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టి ఫ్లై ఓవర్‌పై నుంచి పడి మృతి చెందాడు. వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ ఫ్లైఓవర్‌పైనున్న డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో ఒక ఫ్లైఓవర్ నుంచి మరో ఫ్లైఓవర్ మీదకు పడిపోయారు. కాగా, మెదక్ జిల్లా కకునూరుపల్లికి చెందిన బండి మధు(26), సూర్యాపేట జిల్లాకు చెందిన మచ్చగిరి (24) గచ్చిబౌలి టిమ్స్ ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ టెక్నీషియన్లుగా పనిచేస్తూ మధురానగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరు బైకుపై ఆస్పత్రికి బయలుదేరారు. బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్‌పై షాగౌస్ సమీపంలో ఫ్లై వర్‌పై కుడి వైపు రెయిలింగ్‌కు ఢీ కొట్టడంతో ఫ్లై ఓవర్ నుంచి కింద పడ్డారు. కాగా, తీవ్ర గాయాలతో మధు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలతో గిరి కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇద్దరు మద్యం మత్తులో ఉన్నారని పోలీసులు పేర్కొంటున్నారు. టిమ్స్ ఆస్పత్రికి వెళ్లాలంటే బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్ పైకి వెళ్లాల్సిన అవసరం లేదు. ఎందుకు అటు వైపు వెళ్లారో అర్థం కావడం లేదని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మధు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు.

## తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర గొప్పది

**మంత్రి గంగులను సన్మానిస్తున్న కళాకారులు**

**మంత్రి గంగుల కమలాకర్**




కరీంనగర్/విద్యానగర్,సమ సమాజం: తెలంగాణ సాధనలో కవులు, కళాకారుల పాత్ర గొప్పదని, ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన ఘనత పాటదేనని బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని సీతారాంపుర్ పీఎం కన్వెన్షన్‌లో తెలంగాణ డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాన్స్ స్పోర్ట్స్ వర్క్‌షాప్ ప్రిపరేషన్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం డ్యాన్స్‌ను కళగా కాకుండా క్రీడగా గుర్తించిందని, డ్యాన్స్ స్పోర్ట్స్‌కు తెలంగాణ ప్రభుత్వం సైతం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కరీంనగర్‌లో డ్యాన్స్ అకాడమీ బిల్డింగ్‌ను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.డ్యాన్స్ అకాడమీ భవనానికి వారం రోజుల్లో భూమిపూజ నిర్వహించుకుందామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం మంత్రిని కళాకారులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, ట్రస్మా అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, తెలంగాణ డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కట్ట రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీరామోజు రామకృష్ణ, వంగల శ్రీధర్, కృపాధానం, తిప్పర్తి ప్రభు, లింగంపల్లి నాగరాజు, గసికంటి జనార్దన్‌రెడ్డి, మెతుకు హేమలత తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ దుర్మార్గాలకు మణిపూర్ ఘటన పరాకాష్ఠ

**బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి**

సూర్యాపేట: బీజేపీ దుర్మార్గాలకు మణిపూర్ ఉదంతం పరాకాష్టగా నిలిచిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మండిపడ్డారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అలజడులు సృష్టించి లబ్ధిపొందాలన్నది బీజేపీ వ్యూహంలో భాగంగా కనిపిస్తోందన్నారు. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో పుల్వామా ఉదంతమే ఇందుకు నిదర్శనమన్నారు. నిజానికి పుల్వామా ఉదంతం బీజేపీ సృష్టిగా ఆయన చెప్పారు. ఆదివారం సూర్యాపేట నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి కశ్మీర్‌లో మరో రచ్చ సృష్టించేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా మోదీపై ప్రజల్లో మోజు తగ్గిందని, కర్ణాటక ఫలితమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రధాని హోదాలో మోదీ చేసిన రోడ్ షోలకు జనామోదం లభించలేదన్నారు. ప్రధాని కాకముందు మోదీ ఎక్కడా రోడ్‌షో చేసిన దాఖలాలు లేవన్నారు. బీజేపీ విధానాలు సామాన్యులకే కాకుండా విద్యావంతులకూ నచ్చడం లేదన్నారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ బలహీన పడిందన్నారు. చెడగొట్టే వాడి కంటే ఏమీ చేయలేని వాడే బెటర్ అనుకొని అక్కడ కాంగ్రెస్‌ను ప్రజలు అక్కున చేర్చుకున్నారన్నారు. అనంతరం మంత్రి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు.



# కేసులు ఛేదిస్తూ.. సత్తా చాటుతూ..

- సంచలనాత్మక కేసుల్లో జీరో పెండెన్సీ
- అంతర్రాష్ట్ర నేరగాళ్ల కట్టడికి ప్రత్యేక చర్యలు



హైదరాబాద్,సమ సమాజం: హైదరాబాద్‌లో నేరాలు చేసి తప్పించుకోవాలని చూస్తున్న నేరగాళ్లు ఎక్కడున్నా పోలీసులు పట్టుకుంటున్నారు. అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయి దొంగలను సైతం పట్టుకుని హైదరాబాద్ పోలీసులు సత్తా చూపిస్తున్నారు. దొంగతనాలు, దోపిడీలు, స్నాచింగ్‌లకు సంబంధించిన వ్యవస్థీకృత నేరాలు, సంచలనం సృష్టించిన కేసులను ఈ ఏడాది 100 శాతం ఛేదించే దిశగా పోలీసులు అడుగులు వేస్తున్నారు. ఆశించిన స్థాయిలో విజయాలను కూడా సాధిస్తూ నగర ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. జూలై 20న నగరంలో 15 స్నాచింగ్‌లు జరుగగా.. 14 కేసులను, 60 వరకు సెల్‌ఫోన్ స్నాచింగ్‌లు జరుగగా.. అందులో 58 కేసులను ఛేదించారు. సంచలనం సృష్టించిన దొంగతనాలు, దోపిడీ కేసులను సైతం 100 శాతం ఛేదించారు. ఆస్తి నష్టానికి సంబంధించిన కేసుల్లో నేరస్థులు ఎక్కడున్నా గుర్తించి పట్టుకునే టెక్నాలజీ హైదరాబాద్ పోలీసుల వద్ద ఉంది. దీంతో ఆయా కేసులను వెంటనే ఛేదిస్తున్నారు. ఈ విజయంలో శాంతి భద్రతల పోలీసులకు కొండంత అండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులుంటున్నారు. ఒక నేరం జరిగిందంటే ముందుగా నేరస్థులను పట్టుకునేందుకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి, వేట మొదలు పెడుతున్నారు.. గంటల వ్యవధిలోనే ఎక్కడున్నా గుర్తించి పట్టుకుంటున్నారు.

**అంతర్రాష్ట్ర దొంగలకు చెక్..**

అంతర్రాష్ట్ర దొంగలు హైదరాబాద్ వైపు రాకుండా పోలీసులు కట్టడి చేశారు. అన్నిమార్గాలపై నిఘా పెంచారు. పట్టుబడిన నేరగాళ్ల పాత చరిత్రను తోడి, పీడీ యాక్టులు నమోదు చేస్తూ జైలు నుంచి బయటకు రాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో అంతర్రాష్ట్ర దొంగల్లో వణుకు మొదలై హైదరాబాద్ వైపు చూడాలంటేనే భయపడుతున్నారు. ప్రధానంగా హైదరాబాద్‌లో ఉన్న సీసీ కెమెరాలు, ముమ్మర పెట్రోలింగ్, పోలీసుల పటిష్ట నిఘాతో నేరాలు చాలా వరకు తగ్గాయి. నేరం జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు నేరం జరిగినా వెంటనే రంగంలోకి దిగి టెక్నాలజీ సహాయంతో నేరగాళ్లను గుర్తించి పట్టుకుంటున్నారు.

**పోలీసులకు సమాచారం ఇవ్వడమే ఆలస్యం..!**

దొంగతనం, దోపిడీ, స్నాచింగ్ వంటి ఘటనలు జరిగాయంటే బాధితులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. పోలీసులకు ఎంత త్వరగా ఫిర్యాదు చేస్తే అంతే వేగంగా దొంగలను పట్టుకునే అవకాశం ఉంటుంది. ఫిర్యాదు రాగానే ఘటనా స్థలికి వెళ్లి పరిస్థితిని సమీక్షించడం, ఆ ఘటనపై అధ్యయనం చేస్తున్న పోలీసులు ఒక అంచనాకు వచ్చి వెంటనే నేరస్థులను పట్టుకోవడానికి అవసరమైన కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఆశించిన స్థాయిలో ఫలితాలను సాధిస్తున్నారు.



## వాన కాలం.. వ్యాధులకు దూరం

**ప్రతి ఆదివారం దోమలపై సమరం**

**10 గంటలకు 10 నిమిషాలు.. పరిసరాలు పరిశుభ్రం**

**ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం**

**ఆవర్తన ప్రభావంతో నగరంలో పలు చోట్ల వర్షం**

**జంట జలాశయాలకు తగ్గిన వరద ఉధృతి**

**మూసీలోకి చేరుతున్న 1340 క్యూసెక్కుల నీరు**

హైదరాబాద్,సమ సమాజం: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఆదివారం ఉదయం 10 గంటలకు 10 నిముషాలపాటు దోమల నివారణ కార్యక్రమం'లో ఆయన పాల్గొన్నారు. కోకాపేటలోని తన ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని, చెత్తను స్వయంగా తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన కుటుంబం, ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని చెప్పారు.

ప్రతి ఒకరూ ఆదివారం 10 నిమిషాలు కేటాయించి ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధిచెంది వ్యాధు లు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. డెంగీ, మలేరియా లాంటి వ్యాధులకు దూరంగా ఉండాలంటే అందరూ దోమల నివారణకు కృషి చేయాలని సూచించారు. చికిత్స కన్నా నివారణే ముఖ్యమన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని, వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు పాటించడం మన చేతుల్లోనే ఉన్నదని తెలిపారు. వీధులను మున్సిపల్, గ్రామ పంచాయతీల్లోని సిబ్బంది శుభ్రం చేస్తున్నారని, మన ఇంటి పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలన్నారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల నియంత్రణకు వైద్యారోగ్య శాఖ అన్నివిధాలా సిద్ధంగా ఉన్నదని, దవాఖానల్లో అవసరమైన టెస్టింగ్ కిట్లు, మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## వైశ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

లింగోజిగూడ: తెలంగాణ రాష్ట్రంలోని వైశ్యుల అభ్యున్నతి కోసం తక్షణమే వైశ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలని వైశ్య వికాస వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కాచం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం 'వైశ్యులు–ఆత్మగౌరవం–హక్కుల సాధన'పై కర్మన్‌ఘాట్‌లోని ఓ ఫంక్షన్ హాలులో చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వైశ్యులో ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు, జనాభా ప్రకారం రాజకీయ వాటా, వైశ్య విద్యార్థుల కోసం విదేశీ విద్యానిధి తదితర పథకాలు అమలు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో విశ్రాంతి ఐఏస్ అధికారి జగదీశ్వర్, తెలంగాణ ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షురాలు ఉప్పల శారద తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్‌లో బిగ్ ట్విస్ట్.. రేవంత్‌కు వార్నింగ్!



కరీంనగం,సమ సమాజం: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ స్పీడ్ పెంచిన విషయం తెలిసిందే. ఇటీవల పార్టీలో చేరికలపై కూడా కాంగ్రెస్ హైకమాండ్ ఫోకస్ పెట్టింది. ఇక, కొందరు సీనియర్లకు కీలక పదవులు, బాధ్యతలను కూడా అప్పగించింది. ఈ క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ హైకమాండ్‌పై అలిగినట్టు తెలుస్తోంది. అయితే, పార్టీలో సీనియర్, ఇన్నేళ్లుగా పార్టీలో నిబద్ధతతో పనిచేస్తే తనకు పార్టీలోని ఏ కమిటీల్లో చోటు ఇవ్వకపోవడంతో పొన్నం అసంతృప్తి వెళ్లగక్కారు. ఏ కమిటీలోనూ తనకు అవకాశం ఇవ్వకపోవడంపై తిరుగుబాటు చేసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే తన ఇంట్లోనే డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణతో భేటీ అయ్యారు. ముఖ్య కార్యకర్తలతో అంతర్గత సమావేశం నిర్వహించారు. దీంతో, పొన్నంకు హైకమాండ్ నుంచి పిలుపు రాకపోతే రేపు.. కరీంనగర్‌లోని 7 నియోజకవర్గాల నుంచి దాదాపు 500 కార్లలో హైదరాబాద్‌కు వెళ్లి.. టీపీసీసీ చీఫ్ రేవంత్‌ను కలవనున్నట్టు కార్యకర్తలు హెచ్చరించారు. ఇక, వీరి భేటీ అనంతరం.. కవ్వంపల్లి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో ఏ కమిటీల్లోనూ పొన్నం ప్రభాకర్ పేరు లేకపోవడం ప్రతీ కార్యకర్తకు గుండెకోతను మిగిల్చింది. పార్లమెంట్‌లో ప్రత్యేక తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యమనేత పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ ఎలా మరిచిపోయిందని ప్రశ్నించారు. ప్రస్తుతం ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు ఇచ్చిన ప్రాధాన్యత తనకు ఇవ్వలేదని అసంతృప్తితో రగిలిపోతున్నారు.

## లోన్ యాప్ రుణాలకు ఒకరి బలి

హఫీజ్‌పేట్ : ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకొని వాటిని తీర్చలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు శ్రీరాంనగర్ కాలనీకి చెందిన రావుల రవికుమార్ (43) 5 నెలలుగా ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకొని బెట్టింగ్ గేమ్స్ ఆడుతున్నాడు. ఈ క్రమంలో ఆన్‌లైన్ లోన్ రుణాల డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో లోన్ యాప్‌నకు సంబంధించి తీసుకున్న రుణాలు చెల్లించాలని సంబంధిత వ్యక్తులు రవికుమార్‌ను వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో అతను ఒత్తిడికి గురై మానసికంగా కుంగిపోయాడు. గమనించిన రవికుమార్ భార్య రావుల సంధ్య వారి బంధువులకు ఈ విషయం తెలియజేశారు. రుణాలు తాము చెల్లిస్తామని బాధితుడు రవికుమార్‌కు సోదరులు ధైర్యం చెప్పారు. ఈ క్రమంలో ఆయన తమ్ముడు జయంత్‌కుమార్ చందానగర్‌లో నిర్వహిస్తున్న ది బెస్ట్ ఫర్నిషింగ్ దుకాణంలో రవికుమార్ సేల్స్‌మన్‌గా చేరాడు. ఆదివారం ఉదయం 9 గంటలకు పాల ప్యాకెట్ తీసుకువస్తానంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకూ అతను తిరిగిరాలేదు. మధ్యాహ్నం 12.17 గంటలకు అతని తమ్ముడు జయంత్ కుమార్ వదిన సంధ్యకు ఫోన్ చేసి అన్న రవికుమార్ చందానగర్‌లోని ఫర్నిషింగ్ దుకాణంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చందానగర్ పోలీసులు పేర్కొన్నారు.


## టీమిండియాకు పరాభవం.. ఫైనల్లో పాక్ చేతిలో ఓటమి

ఏసీసీ మెన్స్ ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ ఫైనల్లో పాకిస్తాన్-ఏ..? భారత-ఏ జట్టుకు షాకిచ్చింది. కొలొంబో వేదికగా ఇవాళ (జులై 23) జరిగిన తుది సమరంలో పాక్ 128 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. 353 భారీ లక్ష్య ఛేదనలో తడబడిన టీమిండియా.. 224 పరుగులకు ఆలౌటైంది. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియాకు సైతం శుభారంభమే లభించినప్పటికీ, భారత ప్లేయర్లు దాన్ని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయ్యారు. 61 పరుగులు చేసిన ఓపెనర్ అభిషేక్ శర్మ టాప్ స్కోరర్‌గా నిలువగా.. మరో ఓపెనర్ సాయి సుదర్శన్ (29), కెప్టెన్ యశ్ ధుల్ (39) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. పాక్ బౌలర్లలో సుఫియాన్ ముఖీమ్ 3 వికెట్లు పడగొట్టి టీమిండియాను దెబ్బకొట్టగా.. అర్షద్ ఇక్బాల్, మెహ్రాన్ ముంతాజ్, మహ్మద్ వసీం జూనియర్ తలో 2 వికెట్లు, ముబాసిర్ ఖాన్ ఓ వికెట్ పడగొట్టాడు. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 352 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్లు సైమ్ అయూబ్ (51 బంతుల్లో 59బీ 7 ఫోర్లు, 2 సిక్సర్లు), సాహిబ్‌జాదా ఫర్హాన్ (62 బంతుల్లో 65బీ 4 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపు ఆరంభాన్ని అందించగా.. నాలుగో స్థానంలో బరిలోకి దిగిన తయ్యబ్ తాహిర్ (71 బంతుల్లో 108బీ 12 ఫోర్లు, 4 సిక్సర్లు) విధ్వంసకర శతకంతో విరుచుకుపడ్డాడు. పాక్ ఇన్నింగ్స్‌లో అయూబ్, ఫర్హాన్, తాహిర్‌లతో పాటు ఒమైర్ యూసఫ్ (35), ముబాసిర్ ఖాన్ (35) కూడా రాణించారు. భారత బౌలర్లలో హంగార్గేకర్, రియాన్ పరాగ్ చెరో 2 వికెట్లు పడగొట్టగా.. హర్షిత్ రాణా, మానవ్ సుతార్, నిషాంత్ సింధు తలో వికెట్ దక్కించుకున్నారు.



# సిరాజ్ పాంచ్

**వెస్టిండీస్‌తో రెండో టెస్టులో భారత్ భారీ ఆధిక్యం దిశగా దూసుకెళుతున్నది. కెప్టెన్ రోహిత్‌శర్మ ధనాధన్ బ్యాటింగ్‌తో అదిరిపోయే ఆరంభాన్ని అందుకున్న టీమ్‌ఇండియా మూడు వందల మార్క్ అందుకుంది. చేతిలో ఎనిమిది వికెట్లతో విండీస్ ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశముంది. మహమ్మద్ సిరాజ్ ఐదు వికెట్ల విజృంభణతో వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 255 పరుగులకు పరిమితమైంది. టాపార్డర్ పోరాటపటిమను లోయార్డర్ కొనసాగించలేకపోయింది. సిరాజ్ సూపర్ స్వింగ్‌తో కరీబియన్లను కట్టడి చేయడంలో కీలకమయ్యాడు. రెండో టెస్టులో భారత గెలుపు దాదాపు ఖరారైనా వరుణుడు అడ్డుతగిలే అవకాశం కనిపిస్తున్నది.**




**ఐదు వికెట్లతో విజృంభణ**
**వెస్టిండీస్ తొలి**
**ఇన్నింగ్స్ 255 ఆలౌట్**
**301 పరుగుల**
**ఆధిక్యంలో భారత్**



పోర్ట్‌ఆఫ్ స్పెయిన్: వెస్టిండీస్‌తో రెండో టెస్టులో భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తున్నది. పసలేని విండీస్ బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ టీమ్‌ఇండియా భారీ స్కోరుపై కన్నేసింది. 183 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన భారత్.. కడపటి వార్తలు అందే సమయానికి రెండు వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (15), ఇషాన్ కిషన్ (10) క్రీజులో ఉన్నారు. ఇంకా ఎనిమిది వికెట్లు ఉన్న రోహిత్‌సేన 309 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది. ఓపెనర్లు రోహిత్‌శర్మ(44 బంతుల్లో 57, 5ఫోర్లు, 3 సిక్స్‌లు), యశస్వి జైస్వాల్(38) ధనాధన్ ఇన్నింగ్స్‌తో దుమ్మురేపారు. ముఖ్యంగా హిట్‌మ్యాన్ వచ్చి రావడంతోనే విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఆది నుంచే బౌండరీలు బాదుతూ టెస్టుల్లో తక్కువ(35) బంతుల్లో వేగవంతమైన అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో రెండుమార్లు క్యాచ్ ఔట్ నుంచి బయటపడ్డ రోహిత్..చివరకు గాబ్రియెల్ బౌలింగ్‌లో జోసెఫ్ క్యాచ్‌తో నిష్క్రమించాడు. ఆ తర్వాత నాలుగు పరుగుల తేడాతో యశస్వి రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. వీరిద్దరు కలిసి తొలి వికెట్‌కు 98 పరుగులు జోడించారు. గాబ్రియెల్, వారికన్ ఒక్కో వికెట్ తీసుకున్నారు.

**వారెవ్వా సిరాజ్ :** ఓవర్‌నైట్ స్కోరు 229/5 నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస్..అదే పోరాట పటిమను కొనసాగించలేకపోయింది. ముకేశ్‌కుమార్ తన తొలి ఓవర్లోనే అలిక్ అతానజె(37)ను ఎల్బీడబ్ల్యూ చేశాడు. ఆ తర్వాత స్వింగ్‌స్టర్ సిరాజ్(5/60) తన ప్రతాపం చూపించాడు. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ విండీస్ లోయార్డర్‌ను కుప్పకూల్చాడు. జోషువా డిసిల్వా(10)ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో మొదలైన సిరాజ్ వికెట్ల వేట ఆఖరి వరకు దిగ్విజయంగా సాగింది. హోల్డర్(15), జోసెఫ్(4), రోచ్(4), గాబ్రియెల్(0)ను వరుస విరామాల్లో పెవిలియన్ పంపాడు. ఈ క్రమంలో తన కెరీర్‌లో సిరాజ్ రెండోసారి ఐదు వికెట్ల ప్రదర్శన కనబరిచాడు.



## ఇదీ 'కిక్' సినిమాకు డబుల్ 'ఎక్స్‌ట్రా' : వక్కంతం వంశీ

నితిన్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు 'ఎక్స్‌ట్రా' అనే టైటిల్ ఖరారు చేశారు. 'ఆర్డినరీ మేన్ ' అనేది ట్యాగ్‌లైన్ . ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తున్నారు. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్యా మూవీస్ అండ్ ఎంటర్‌టైన్మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 23న విడుదల కానుంది.

తాజాగా ఆదివారం ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్, రిలీజ్ డేట్‌ను ప్రకటించారు మేకర్స్. "కిక్' సినిమా తర్వాత ఆ రేంజ్‌లో క్యారెక్టర్ బేస్డ్ స్క్రిప్ట్‌తో 'ఎక్స్ ట్రా' సినిమా తెరకెక్కుతోంది. ఆడియన్స్ రోలర్ కోస్టర్ లాంటి ఎక్స్‌పీరియన్స్ ఇస్తూనే, నవ్విస్తూ సర్‌ప్రైజ్‌లతో మెప్పిస్తుంది మా సినిమా" అన్నారు వక్కంతం వంశీ. ఈ సినిమాకు సంగీతం: హారిస్ జైరాజ్.

## 'భోళాశంకర్' ట్రైలర్ విడుదల ఎప్పుడంటే..

చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'భోళాశంకర్' ట్రైలర్ రిలీజ్‌కు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 27న ట్రైలర్ విడుదలకానుంది. మెహర్ రమేష్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తి సురేష్ నటించారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈ సినిమా ఆగస్టు 11న థియేటర్స్‌లో రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. కాగా 'భోళాశంకర్' ట్రైలర్‌ను ఈ నెల 27న(గురువారం) విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఆదివారం అధికారికంగా ప్రకటించి, చిరంజీవి లుక్‌ని రిలీజ్ చేసింది. చేతిలో కత్తి పట్టుకుని సీరియస్ లుక్‌లో నడిచి వస్తున్నారు చిరంజీవి. ఈ సినిమాలో సుశాంత్, రఘుబాబు, మురళీ శర్మ, రవిశంకర్, 'వెన్నెల' కిషోర్, తులసి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, కెమెరా: డడ్లీ, లైన్ ప్రొడక్షన్: మెహర్ మూవీస్.



## కుశలమా!

సూర్య హీరోగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'కంగువ'. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ హీరోయిన్. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఆదివారం(జూలై 23) సూర్య పుట్టినరోజు సందర్భంగా 'కంగువ' టీజర్‌ని విడుదల చేశారు మేకర్స్. 'కొండల కోనల్లో కోటి పులులు పట్టినోడు, ముక్కోటి చుక్కలెక్కి దిక్కులే ల్ల గెలిచినోడు, ఒక్కడే ఒక్క వీరుడురా.. వాడే కంగ' వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. 'కుశలమా' అంటూ సూర్య చెప్పే డైలాగ్‌తో టీజర్ ముగుస్తుంది.

"చారిత్రక నేపథ్యంతో రూపొందుతోన్న చిత్రం 'కంగువ'. సూర్య కెరీర్‌లో భారీ బడ్జెట్‌తో ఈ మూవీ తెరకెక్కుతోంది. త్రీడీలో విజువల్ వండర్‌గా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేందుకు టీమ్ శ్రమిస్తోంది. పాన్ వరల్డ్ మూవీగా పది భాషల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. సూర్య బర్త్ డే సందర్భంగా తెలుగు, ఇంగ్లీష్, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో టీజర్‌ని రిలీజ్ చేశాం.. మరో నాలుగు భాషల్లో త్వరలోనే విడుదల చేస్తాం. వచ్చే ఏడాది వేసవిలో 'కంగువ' రిలీజ్ కానుంది" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఏజే రాజా, కో ప్రొడ్యూసర్: నేహా జ్ఞానవేల్ రాజా.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in